# మూగి దొడ్డ

కనక ప్రసాద్



**కవిత:** మూగి దొడ్డ

**రచన:** కనక ప్రసాద్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: మార్చి 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2120

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

## మూగి దొడ్డ

అపరిచితులు ఎవరెవరో అటూ ఇటూ పరిగెడ్తున్న
పెళ్ళి పందిట్లోంచి చాటుగా జారుకుని
ఒక చిన్ననాటి స్నేహితుడింటికి ఆటో వెతుక్కోడాన్ని
వర్ణించడానికి సరైన మాటలు లేవు
– 'ఎవరితను? పిల్ల తండ్రివంక ఫ్రెండ్సుట!' అని
ఆవిడ పెన్సిల్వేనియా మొహాన్ని అటు తిప్పుకుని
తలంబ్రాల వేదిక వైపు మరలిపోయినప్పుడు

గేటవతల ఒక్కడివీ నిలబడి
ఎన్నటికీ ఈ సంబరంలో నువ్వు పైవాడివేననీ
అటు పిల్లవంకా ఇటు పిల్లడి వంకా నిజానికి
ఎవరికీ ఎప్పటికీ ఏమీ కావనీ నువ్వు ఏ తోటలోనూ దిగలేవనీ
ఎవరితోనైనా షామియానాలో అందామనుకుని
నీదీ అనుకున్నది ఎంచేతో నీకూ తెలీకుండానే జారిపోడాన్ని
ఎటు చెప్పకోడానికీ ఇదమిద్ధం అని ఒక్క మాటా లేదు –

ఎంచేతంటే
'వీడ్కోలు మిత్రమా! శలవు తీసుకుంటానింక ...' అని
నలుగురూ జనాంతికంగా అనుకునేది ఏ ఒక్క మాట నీకు మిగిలినా
ఇరవై రెండేళ్ళనాటి పాత స్నేహితుడతను ట్రాఫిక్ రొదలో
స్కూటరు ఓ పక్కకి తీసి ఇబ్బందిగా 'ఇంకేంటండీ?' అన్నట్టు
నిలబడ్డాన్ని గురించి చెప్పుకోడానికి ఆ మాటనే వాడుండేవాడివి,
ప్రశ్నార్థకంగా నిల్చున్న ఆవిడ నీడన

ఇప్పటి మొహంలో నీ బాల్యపు చాయల్ని వెతుక్కుంటూ
ఇతనింక నీ స్నేహితుడు కాదని
ఏదో ఒక పాతప్పటి పరిచయస్థుడు మాత్రమేననీ
ఇంకా జైలు గోడంట పెరుగుతోందనుకున్న ఆ చింత మొక్కకి
నువ్వూ అతనూ ఏనాడాయీ ఏ ఉచ్చలూ పొయ్యలేదనీ
అది ఎప్పుడో చచ్చిపోయుంటుందనీ
ఇన్నేళ్ళ తరవాత 'సరేనమ్మా! కలుద్దాం మరి....ఓ.కె.?'
అనుకుని
'అమ్మయ్య! ఈ నటన ఇంక ఆపెస్తా'మని
ఒకే క్షణంలో ఇద్దరూ ఒడంబడిక చేసుకున్నట్టు
హడావిడిగా వీధి దీపాల మలుపులు తిరిగిపోడాల్ని
కలబోసుకోడానికి దేనికీ
మాటలు లేవు.

నువ్వు సప్త సముద్రాలవతల విడిచి వచ్చిన ఈ భాష
నిన్ను ఎత్తుకుని పెంచిన
చదువురాని విధవరాలు మూగి దొడ్డ.

బతుకంతా అందరికీ అడ్డ చాకిరీలు చేసి చేసి అలిసిపోయి
ఈ సుదూరపు వృద్ధాశ్రమంలోన ఇది
నీ ఒంటరి అవసరాలకి సరిపడినంత మాత్రం వడ్డించి
'ఇంక వెళ్ళనా? రామకోటి రాసుకోవాలి నేను...?' అన్నట్టు
తలుపువార నిలబడుతుంది
మాటలులేని తనంతో

ముసిలి ప్రేమల్ని

ముంగి జ్ఞాపకాల దండేనికి తగిలించి

ఎటూ ఏమీ చెప్పుకోలేకుండా.

★

For Latest Telugu Books - Visit now:

Kinige.com